క్లుప్తంగా

ఆర్థికసాయం

ఏటూరునాగారం: మండలంలోని షాపెల్లి గ్రామానికి చెందిన గొంది రవితేజ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రూ.11వేల ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘు, వెంకన్న, చందు, ఆయూబ్, దేవేందర్, ఖలీల్, ఎల్లయ్య, గౌస్, సులేమాన్, వినయ్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టాలి



కాటారం: రైతులకు యూరియా పంపిణీ సక్రమంగా చేపట్టాలని, పీఏసీఎస్, డీసీఎం కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలల్లో యూరియా, ఇతర ఎరువుల నిల్వలను ప్రదర్శించాలని డీఏఓ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాంలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను ఆయన పరిశీలించి పంపిణీ ప్రక్రియను పర్యావేక్షించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. రైతులకు సరిపడా యూరియా అందుతుందని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. యూరియా దిగుమతికి అనుగుణంగా రైతులకు సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం యూరియా పంపిణీ చేయాలని కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఏఓ వెంట ఏఓ పూర్ణిమ, సిబ్బంది ఉన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా



రేగొండ: యూరియా కొరతను నిరసిస్తూ సోమవారం రేగొండ మండల కేంద్రంలో రైతులు ధర్నాకు దిగారు. సోమవారం మండలంలోని పీఏసీఎస్‌కు యూరియా వస్తుందని తెలియడంతో తెల్లవారుజామునుంచే వివిధ గ్రామాల రైతులు సొసైటీ వద్దకు వేల సంఖ్యలో చేరుకున్నారు. సొసైటీకి 400 బస్తాలు మాత్రమే రాగా అధికారులు పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు ఆగ్రహించి పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

సుభాష్‌నగర్‌లో వైద్యశిబిరం

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సుభాష్‌నగర్‌లో తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ సంగీత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 36 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారి రక్త నమూనాలు సేకరించి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కలుపు కష్టాలు

- వరి పంటలో పెరిగిన కలుపు మొక్కలు
- కూలీల కొరతతో ఇబ్బందులు

వెంకటాపురం(కె): వరి నారుమడిలో విత్తనాలు చల్లిన నాటి నుంచి రైతులను నష్టాలు ఒకదాని వెంట మరొకటి వెంటాడుతున్నాయి. కరెద చల్లిన రైతులకు నార్లు పోసుకున్న రైతులకు 15 రోజుల పాటు వర్షాలు లేక నారుమడులు ఎండిపోగా కరెద చల్లిన మొక్కలు మొలవక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాట్లు వేసిన దగ్గర నుంచి మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో వచ్చిన కలుపును తొలగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు యూరియా కొరత, మరో వైపు కూలీల కొరతతో అవస్థలు పడుతున్నారు. పెరిగిన కూలీల రేటుతో పెట్టుబడి ఖర్చులు ఎక్కువ అవుతున్నాయని కలుపు పెరగటంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు.



పెరిగిన వరి పంట

భారీ వర్షాలతో పని చేయలేక..

ఈ వానాకాలం సీజన్‌లో వరి నాట్లు వేసిన తర్వాత మండలంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. పంట పొలాల్లో ఎలాంటి పనులు చేయటానికి అవకాశం లేకుండా పోయింది. భారీ వర్షాలు కురవడంతో గడ్డి జాతి మొక్కలతో పాటు తుంగ, గరిక విపరీతంగా పెరిగి వరి పంటకు వేసిన ఎరువుల బలాన్ని కలుపు మొక్కలే గ్రహించాయి. దీంతో పంట ఏపుగా పెరగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం పొలంలో కలుపు తీయాలంటే 20 నుంచి 25 మంది కూలీలు అవసరం ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఒక్కో కూలీకి దాదాపు రూ.500 చెల్లించాల్సి వస్తోందని అయిన దొరకని పరిస్థితి అని వాపోతున్నారు.

పనులు సాగడం లేదు



వానాకాలం సీజన్‌లో వరి పంటలో కలుపు విపరీతంగా పెరిగింది. వరినాట్లు వేసిన తర్వాత నుంచి మండలంలో అధిక వర్షాలు కురుస్తుండటంతో వరి పొలాల్లో పనులు సాగడం లేదు. దీంతో కలుపు పెరిగి పోయింది. కూలీలతో కలుపు మొక్కలు తొలగించడానికి కూడా వీలు పడడం లేదు. పెరిగిన కూలీల రేటుకు తోడు కొరతతో ఇబ్బందులు పడుతున్నాం.

– కృష్ణ, రైతు, బీసీమద్రగూడెం

సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న డైలీవేజ్‌వర్కర్లు



భిక్షాటన చేస్తున్న వర్కర్లు, నాయకులు

ఏటూరునాగారం: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను డైలీ వేజ్ వర్కర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంత్రిని కలిసి వారి సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. స్పందించిన సీతక్క రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దావూద్, రత్నం రాజేందర్ మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో 20 మంది వర్కర్లకు టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని అదేవిధంగా ఇక్కడ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ నాగలక్ష్మి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, కమల, జయలక్ష్మి, నాగమణి, సరోజన, లలిత, రాజు, సారబాబు, శాంతమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

డైలీవేజ్ వర్కర్ల భిక్షాటన

మండల కేంద్రంలో 11 రోజులుగా సమ్మె చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల డైలీవేజ్ వర్కర్లు సోమవారం మండల కేంద్రంలో భిక్షాటన కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టారు. నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నాయకులు సీఐటీయూ జిల్లా నాయకులు దావూద్, రాజేందర్ అన్నారు. వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో వర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- సీఐ ముత్యం రమేశ్

వెంకటాపురం(కె): క్రీడల్లో గెలుపోటములు సహజం అని వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ క్రీడా మైదానంలో డివిజన్ స్థాయి వెంకటాపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని అన్నారు. ఈ పోటీలకు వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం మంగపేట మండలాల నుంచి పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.55,555, రెండో బహుమతి రూ.33,333, మూడో బహుమతి రూ.22,222, నాల్గో బహుమతి రూ.11,111లతో పాటు షీల్డును అందజేయనున్నట్లు క్రికెట్ పోటీల నిర్వాహకులు తెలిపారు. అనంతరం పోలీస్ టీమ్, ప్రెస్ టీమ్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు, పీర్ల కృష్ణబాబు, బాలసాని అశ్వపతి, ఎస్సై కొప్పుల తిరుపతి రావు, పీఎస్సై తిరుపతి రెడ్డి, గొంది హనుమంతు తదితరులు ఉన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రమేశ్

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

ములుగు రూరల్: బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేయాలని అఖిల పక్ష కమిటీ నాయకుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని సర్వాపూర్‌లో పంచాయతీ కార్యదర్శితో వినతిపత్రం అందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు బతుకమ్మ ఆడుకునే ప్రాంతాలలో సౌకర్యాలు కల్పించాలని అన్నారు. గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు అప్పాజీ ఐలయ్య, గుండబోయిన శ్రీహరి, సంతోష్‌గౌడ్, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిగౌడ్

గుడుంబా స్థావరాలపై దాడులు

కాటారం(మహాముత్తారం): గుడుంబా నిర్మూలన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కాటారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మహాముత్తారం మండలం రెడ్డిపల్లి, కనుకునూర్, సింగంపల్లి గ్రామాల్లో సోమవారం గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మారుమూల గ్రామాల్లో అక్రమంగా గుడుంబా తయారీ, సరఫరా జరుగుతుందనే సమాచారం మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు వరంగల్ ఎసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్, కాటారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించినట్లు కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. ఈ దాడుల్లో 2400 లీటర్ల చెక్కర పానకం, తయారీ సామాగ్రి ధ్వంసం చేసి 50 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు. గుడుంబా తయారీ, సరఫరా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజసమ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రజిత, కాటారం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి



మంగపేట: దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క



ఏటూరునాగారం: చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

- మంత్రి సీతక్క

మంగపేట: జిల్లాలో అత్యధిక గ్రామ పంచాయతీలు అత్యధిక జనాభా కలిగి ఉన్న మంగపేట మండల అభివృద్ధికి కృషి చేస్తానని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని కమలాపురం, రాజుపేటలో ఆమె సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమలాపురంలో గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఎర్రవాగు ఉప్పొంగడంతో వాగు వెంట ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని ఇందిరానగర్, బగత్‌సింగ్ కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో నష్టపోయిన 75 కుటుంబాల బాధితులకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. గ్రామంలో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. ఎర్రవాగులో చెట్ల తొలిగింపు పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నివేదిలను రూపొందిస్తున్నమన్నారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ అభివృద్ధి పనులకు రూ.25 కోట్ల నిధుల మంజూరు కొరకు కేంద్ర మంత్రికి తానే నివేదిక ఇచ్చానన్నారు.

పరామర్శ

మండలంలోని రాజుపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కర్రి నాగేంద్రబాబు తండ్రి నర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, యానయ్య పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ఏటూరునాగారం: చిన్న వయస్సులో వివాహం చేసుకుంటే అనేక అనార్థాలు వస్తాయని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరై లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు పెళ్లిలు చేయొద్దన్నారు. బాలికలకు వివాహం చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. తహసీల్దార్ జగదీష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి సీతక్క

ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద చోటు చేసుకుంది. ఐటీడీఏకు వచ్చిన మంత్రి సీతక్క తిరుగు ప్రయాణంలో ఈ సంఘటన చూసి క్షతగాత్రుడిని చూసి ఆగి ఆస్పత్రికి తరలించాలని అధికారులను ఆదేశించి మానవత్వాన్ని చాటుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం(కె): మండల పరిధిలలోని ఎదిర ఎంపీయూపీఎస్ లో ప్రీ ప్రైమరీలో టీచర్లు, ఆయా నియామకాలకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీచర్లకు ఇంటర్ పాసైన అభ్యర్థులు, ఆయాకు ఏడో తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నేడు(మంగళవారం) సాయంత్రం ఐదు గంటలలోపు విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- డాక్టర్ అభినవ్

కన్నాయిగూడెం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని డాక్టర్ అభినవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గైనాకాలజిస్ట్ అనిత హాజరై మహిళలకు వివిధ వాధులపై పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం డాక్టర్ అభినవ్ మాట్లాడుతూ... ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. మహిళలు ఆరోగ్యంపై జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, రమణ కుమారి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఏటూరునాగారం: స్టార్ యూత్ ఆధ్వర్యంలో..



ఏటూరునాగారం: బాల త్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు



కొలువుదీరిన అమ్మవారు

జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారు సోమవారం మండపాల్లో కొలువుదీరారు. మొదటి రోజు బాలత్రిపురసుందరిగా అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అభిషేకం, కుంకుమార్చన, హోమం, తదితర ప్రత్యేక పూజలు చేసి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



వెంకటాపురం(కె): అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న గ్రామస్తులు



చల్వాయి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో..



వెంకటాపురం(ఎం): పూజలు చేస్తున్న భక్తులు



వెంకటాపురం(కె)లో..



కమలాపురంలో..



మంగపేట: పూజలు చేస్తున్న మాలధారులు



మంగపేట: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం: ఊరేగింపుగా తీసుకువస్తున్న భవాని స్వాములు

'కార్మికులకు దక్కని లాభాల వాటా'

భూపాలపల్లి అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం మోసంతో కార్మికులకు సరైన లాభాల వాటా దక్కలేదని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మినహా ఇతర కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఏరియాలోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. సింగరేణి 2024–25 సంవత్సరానికి 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి రూ.6,394వేల కోట్లు నికర లాభాలు వచ్చాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం ఒక్కో కార్మికునికి రూ.2 లక్షలు వస్తున్నాయంటే మొత్తం రూ.819 కోట్లను మాత్రమే 34శాతం లాభంగా ప్రకటించారన్నారు. గత సంవత్సరం రూ2,360 కోట్ల లాభాలు చూపిస్తూ మిగిలిన వాస్తవ లాభాలను దాచేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవ నికర లాభాలు రూ.6,394 కోట్లు వస్తే అందులో రూ.4,034 కోట్లను సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టినట్లు తెలిపారు. కార్మికులకు రూ.819 కోట్లలో 12.8శాతం వాటా మాత్రమే వస్తుందని వివరించారు.

లాభాలను కార్మికులకు ఉపయోగించాలి

సింగరేణి కార్మికులను సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిరుత్సాహానికి గురి చేసిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) బ్రాంచీ కార్యదర్శి కంపేటి రాజయ్య ప్రకటనలో ఆరోపించారు. కార్మిక వర్గం నుంచి 35శాతం లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేసిన 34 శాతం మాత్రమే ప్రకటించడం సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వసూళ్లు చేయకుండా కార్మికులు సాధించిన లాభాలను మళ్లించడం సరైనది కాదన్నారు. కార్మికులతో వచ్చిన లాభాలను కార్మికుల అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. కార్మికుల పెండింగ్ సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలని కోరారు.